సాక్షి చిత్తూరు

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



రా రమ్మంటున్న బోయకొండ

దసరా మహోత్సవాల్లో భాగంగా బోయకొండ గంగమ్మ ఆలయంలో పుష్పాలంకరణలు కనువిందు చేస్తున్నాయి.

- IIలో



రాకెట్టు..అదిరేట్టు

బాల్‌బ్యాడ్మింటన్‌లో జాతీయ స్థాయిలో ఉమ్మడి చిత్తూరు గ్రామీణ విద్యార్థులు సత్తా చాటుతున్నారు.

- IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	32	21
తిరుపతి	33	22
తిరుమల	29	18
గూడూరు	35	24
నగరి	33	23

న్యూస్‌రీల్

మహాలక్ష్మీ నమోస్తుతే!



శ్రీమహాలక్ష్మిగా అమ్మవారు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ దసరా మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం అమ్మవారు శ్రీమహాలక్ష్మి అలంకారంలో భక్తులను కటాక్షించారు. వేకువ జామున ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అలంకరణల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి ఉత్సవర్లకు అభిషేక పూజల అనంతరం పట్టుపీతాంబరాలు, పరిమళభరితపు పుష్పమాలికలు, విశేషాభరణాలతో శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. వేదపండితులు గోవర్ధనశర్మ, గంగిరెడ్డి, అర్చక బృందం హోమ పూజలను నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ నాగరాజరెడ్డి, ఈఓ చంద్రమౌళి, ఉభయదారులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు ధనలక్ష్మీదేవిగా..

దసరా మహోత్సవాల్లో నాలుగో రోజు బుధవారం అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకారంలో దర్శనం ఇస్తారని ఈవో చంద్రమౌళి తెలిపారు. ఉదయం ఆలయంలో అభిషేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

రూ.6 కోట్లతో పుంగనూరులో సోలార్ ప్లాంట్



స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్, చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: మున్సిపల్ విద్యుత్ బిల్లులు తగ్గించేందుకు సుమారు రూ.6 కోట్లతో సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. మంగళవారం ఈ మేరకు కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా కాంట్రాక్టర్లతో కలసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద స్థల పరిశీలన చేశారు. ఈమేరకు మంత్రికి నివేదించనున్నారు. చైర్మన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రతినెల సుమారు రూ.50 లక్షల మేరకు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మంత్రి పెద్దిరెడ్డి సోలార్‌ప్లాంటు నిర్మించి, నిధులు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు మళ్లించేలా నిర్ణయించారని తెలిపారు. త్వరలోనే ఈ పనులను మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

21 వరకు రేషన్ పొడిగింపు

చిత్తూరు రూరల్: జిల్లాలో ఈనెల 21వ తేదీ వరకు రేషన్ పంపిణీని పొడిగించినట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పంపిణీ 79 శాతం పూర్తయిందన్నారు. మిలిగిన కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పక్కాగా జగనన్న పాల వెల్లువ సర్వే



పుణ్యసముద్రంలో సర్వేను యాప్‌లో పరిశీలిస్తున్న జేసీ

తవణంపల్లె: జగనన్న పాల వెల్లువ సర్వేను పక్కాగా నిర్వహించి నివేదికలు పంపాలని వలంటీర్లు, డిజిటల్ అసిస్టెంట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని దిగువ మాఘం, పుణ్యసముద్రం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆయన తనిఖీ చేశారు. వలంటీర్లు, డిజిటల్ అసిస్టెంట్లు ఇంటింటికీ వెళ్లి సమగ్రంగా సర్వే చేయాలన్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డీఎల్‌డీఓ రవికుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ పాల్గొన్నారు.



సింహ వాహనంపై కొలువైన స్వామివారు



ముత్యపు పందిరి వాహనంపై ఊరేగుతున్న దేవదేవేరులు

నేటి వాహనసేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం మలయప్పస్వామివారు ఉభయదేవేరులతో కలిసి కల్పవృక్ష వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించనున్నారు.రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు సర్వభూపాల వాహనంపై భక్తులను కటాక్షించనున్నారు.



మహిషాసుర మర్ధిని ఘట్టం

బ్రహ్మాండోత్సవం



ఆహా..
శ్రీవారి
నవరాత్రి
బ్రహ్మోత్సవ వేళ
భువి వైకుంఠంలో అడుగిడిన
వారిదే కదా పుణ్యము..
దేవదేవుని వైభవాన్ని వీక్షించిన
వారిదే కదా భాగ్యము..
యోగ నారసింహుని దర్శించిన
వారి జన్మమే కదా చరితార్థము..
దివ్య తేజస్సుతో అలరారుతున్న
శ్రీమన్నారాయణుని సేవించిన
వారిదే కదా మోక్షము..
ముత్యపు పందిరి నీడలో
కొలువైన మలయప్పస్వామిని
కనులారా కాంచిన వారి
జీవితమే కదా పునీతము..
బ్రహ్మాండనాయకుని
కటాక్షం పొందిన వారిదే కదా
సంబరము.

- వైభవంగా తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- సింహ, ముత్యపు పందిరి వాహనాలపై విహరించిన స్వామివారు
- వైకుంఠనాథుని సేవకు తరలివచ్చిన అశేష భక్తజనులు

తిరుమల: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. మంగళవారం మూడోరోజు ఉదయం స్వామివారు యోగనారసింహుని అలంకారంలో సింహ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం ఆలయం వెలుపల కొలువు మండపంలో ఏర్పాటు చేసిన నేతి దీపాల వెలుగులో దేవదేవుడు శ్రీమన్నారాయణుని రూపంలో ఊయలలూగుతూ దర్శనమిచ్చారు. అనంతరం రాత్రి ముత్యపు పందిరి వాహనంలో బాలకృష్ణునిగా ఉభయ దేవేరీ సమేతంగా ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శనలు అలరించాయి. ఆలయం, పుష్కరిణి, మాడవీధుల్లో తీర్చిదిద్దిన పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. పాపవినాశనం మార్గంలోని పుష్ప, ఫొటో ప్రదర్శనశాలకు విశేష స్పందన లభిస్తోంది. విద్యుద్దీపాలంకరణలో ఆనందనిలయం దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. వాహన సేవల్లో టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వాహనసేవలో సతీ సమేతంగా టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ వేమిరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి



కళాకారుల ప్రదర్శన



సంప్రదాయ నృత్యం

డేంజరస్ జాండీస్

- జిల్లాలో పెరుగుతున్న కేసులు
- వ్యాధి తీవ్రత..వైద్య పరీక్షలతో బయటపడుతున్న వైనం
- మేల్కోకుంటే ముప్పు తప్పదంటున్న వైద్యులు
- నాటు వైద్యం మానాలని సూచన



చిత్తూరులో కామెర్ల సోకిన చిన్నారులకు చికిత్స

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కామెర్ల కేసులు

నెల	సంఖ్య
జూన్	1,256
జులై	1,896
ఆగస్టు	2,015
సెప్టెంబర్	1,621

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..

జిల్లా ఆస్పత్రులు	2
టీచింగ్ ఆస్పత్రులు	2
పీహెచ్‌సీలు	104
సీహెచ్‌సీలు	17
ఏరియా ఆస్పత్రులు	5
ప్రైవేటు ఆస్పత్రులు	4 వేలకుపైగా

చిత్తూరు రూరల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కామెర్లు (జాండీస్) చాప కింద నీరులా విస్తరిస్తోంది. వ్యాధి తీవ్రతతో బయటపడుతోంది. నెలవారీగా వందల సంఖ్యలో కేసులు నమోదవుతుండడం కలవరం రేపుతోంది. అనారోగ్య సమస్యలు తలెత్తితే చేసే నిర్ధారణ పరీక్షలతో వెలుగుచూస్తోంది. ఆస్పత్రులకు వచ్చేవారిలో 10 శాతం మాత్రమే లక్షణాలున్నవారు వస్తుండగా, 90 శాతం మందిలో ఆ లక్షణాలు కనిపించకుండానే వ్యాధి నిర్ధారణ అవుతోంది. ప్రభుత్వాస్పత్రుల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో చికిత్స...

చాలామంది అవగాహన లేక కామెర్లకు నాటుమందులు వాడుతున్నారు. ఇది చాలా ప్రమాదకరం. ప్రాణాంతకం కూడా. కామెర్లకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందుబాటులో ఉంది. సకాలంలో సరైన చికిత్స తీసుకోకపోతే కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంది. రక్త హీనత కారణంగా ఏర్పడిన కామెర్లను ఎర్ర రక్త కణాలను అభివృద్ధి పరచడం ద్వారా అదుపు చేస్తారు. హెపటైటిస్ కారణంగా వచ్చే కామెర్లను తగ్గించేందుకు యాంటీ వైరల్ మందులు, స్టెరాయిడ్స్ ఇస్తారు. నాళాలలో అడ్డంకుల కారణంగా కామెర్లు వస్తే, శస్త్రచికిత్స ద్వారా తొలగిస్తారు. ఏమైనా మందులు వాడే వారికి ఆ రసాయనాల వల్ల కామెర్లు వస్తే, ప్రత్యామ్నాయ మందులు సిఫార్సు చేయడంతో పాటు వాటి దుష్ఫలితాలను తగ్గించేందుకు అవసరమైన చికిత్స అందిస్తారు.

హెపటైటిస్ ఏ, ఈ వైరస్‌ల వల్ల వచ్చే కామెర్లు చాలా ప్రమాదకరం.

ఈ లక్షణాలు కనిపిస్తే..

అలసట, జలుబు, ఫ్లూ, పొత్తికడుపు నొప్పి, ఆకలి మందగించడం, బరువు పెరగడం, వాంతి, వికారం, మూత్రం రంగు మారుతుంది, పట్టించుకోకపోతే కాలేయం వాపునకు గురై, చర్మం పసుపు రంగులోకి మారి కళ్లు రంగు మారుతాయి.

వ్యాప్తి ఇలా..

రక్త మార్పిడి, డయాలసిస్ రోగులు, తలసేమియా, వివాహేతర సంబంధాలు, విచ్చలవిడి శృంగారం, ఒకసారి వాడిన నీడిల్స్ వాడడం, శరీరంపై టాటు వేయించుకోవడం, అధికంగా మద్యం సేవించడం, ఇతరులు వాడిన వస్తువులు వాడడం వల్ల ఏ, బీ, సీ, డీ, ఇ, ఎఫ్, జీ అనే ఏడు రకాల హెపటైటిస్ వ్యాధులు సక్రమిస్తాయి. ఇందులో ప్రాణాంతకరమైనవి బీ,సీ.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



చర్మం, కళ్లలోని తెల్లటి భాగం పసుపు పచ్చ రంగుకు మారడమే కామెర్లకు సంకేతం. రక్తంలో బైలిరుబిన్‌అనే పదార్థం అధికంగా చేరడంతో ఇది సంక్రమిస్తుంది. బైలిరుబి పరిమాణం ఎక్కువైనప్పుడు అది కణజాలాలోకి చేరి వాటికి పసుపురంగును కలిగిస్తుంది. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

– రాజశేఖర్‌రెడ్డి,ఇన్‌చార్జ్‌డీసీహెచ్‌ఎస్

పిల్లల విషయంలో నిర్లక్ష్యం వద్దు...



పుట్టకతోనే చిన్న పిల్లలకు జ్యాండిస్ రావడం పరిపాటిగా మారింది. ఇందుకు కారణంగా తల్లి తీసుకునే ఆహార అలవాట్లు, బ్లడ్ గ్రూప్‌లో మార్పులు. దీని వల్ల పిల్లలకు పెద్దగా ప్రమాదం కాకపోవచ్చు. జ్యాండిస్ లక్షణాలను గుర్తించి.. ఫొటోథెరపీలో ఉంచి చికిత్స అందిస్తుంటారు. తర్వాత కూడా పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలి.

– రవిరాజు, డీఐఓ, చిత్తూరు

దేశానికే ఆదర్శం ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ కార్డులను ప్రదర్శిస్తున్న మంత్రి రోజా

నింద్ర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనల నుంచి అవిర్భవించిన అద్భుత పథకం జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శుక్రవారం మండలంలోని నేట్టేరి గ్రామంలో జగన్నన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్టాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలందించేందుకు విలేజ్ క్లినిక్, రోగుల వద్దకే వైద్యం అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టను తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు. జగన్నన ఆరోగ్య సురక్షతో పైసా ఖర్చులేకుండా ఖరీదైన వైద్యం ఉచితంగా పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిదన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి ముఖ్యమంత్రిగా చేసేందుకు రానున్న ఎన్నికల్లో కూడా ఆదరించాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో 350 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. 88 మందికి కంటి అద్దాలు అందజేశారు. 71 మందికి రూ.5లక్షల ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ భగవతి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా కార్యదర్శి మేరి, మండల కన్వీనర్ వేణురాజు, వైద్యాధికారులు కల్యాణి, గౌరి పాల్గొన్నారు.

ఐఈఆర్‌పీ పోస్టుల అభ్యర్థుల జాబితా సిద్ధం

చిత్తూరు కలెక్టరేట్ : ఐఈఆర్‌పీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు జాబితాను సిద్ధం చేసినట్లు సమగ్రశిక్ష శాఖ ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఐఈఆర్‌పీ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ పూర్తి చేసినట్లు చెప్పారు. 1:3 నిష్పత్తిలో సిద్ధం చేసిన జాబితాను జిల్లా కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు జాబితాను పరిశీలించుకోవాలని ఏపీసీ తెలిపారు.

ఆలయ అభివృద్ధే లక్ష్యం



మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు,ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తానని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అగరంపల్లె మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చైర్మన్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలపాటు ఆలయ చైర్మన్‌గా ఆలయ అభివృద్ధికి కృషి చేశానన్నారు. ఆలయ పునర్నిర్మాణం, అద్దాల మండపం పనులు స్వామివారి ఆశీస్సులతో విజయవంతంగా పూర్తి చేశానని తెలిపారు. కరోనా అనంతరం రెండు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. రెండోసారి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. పాలకమండలి సభ్యులు, ఉభయదారులు, అధికారుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవి వచ్చేలా సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి, దేవదాయ శాఖ మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే ఎంఎస్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఈఓ వెంకటేశు, సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

క్లుప్తంగా

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


జయచంద్ర(ఫైల్)

గుడిపాల: మండలంలోని 189 కొత్తపల్లె దళితవాడకు చెందిన జయచంద్ర(37) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. సోమవారం ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి వెళ్లిన ఇతను మళ్లీ రాలేదు. పలు చోట్ల వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో మంగళవారం తండ్రి చిన్నబ్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో అదే గ్రామ సమీపంలోని చెన్నై–బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ హైవేకు సమీపంలోని ఓ చెట్టుకు వ్యక్తి ఉరేసుకుని మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని కిందికి దింపించారు. జయచంద్ర మృతదేహంగా గుర్తించారు. పెళ్లికాలేదన్న మనస్తాపంతోనే మృతి చెందినట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు


క్షతగాత్రులు ఆస్పత్రికి తరలింపు

- ఇద్దరికి తీవ్రగాయాలు

శ్రీరంగరాజపురం : మండలంలోని కోటార్లపల్లె భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా, మరొ వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని సీకే పురం గ్రామానికి చెందిన లక్ష్మీపతి, కామేష్ చిత్తూరు నుంచి పనులు ముగించుకుని ద్విచక్ర వాహనానంలో స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యమంలో కోటార్లపల్లె పెట్రోల్ బంక్ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని చిత్తూరు వైపు వెళుతున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీపతి, కామేష్‌తో పాటు ద్విచక్ర వాహనం దూసుకురావడంతో నెల్లెపల్లెకు చెందిన విజయ్ గాయపడ్డారు. లక్ష్మీపతి, విజయ్ పరిస్థితి విషమంగా ఉంది. కామేష్ స్వల్పంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ పరారీలో ఉనట్లు సమాచారం.

రాకెట్టు.. అదిరేట్టు!

సాక్షి ఫోకస్



- మాది తిరుపతి జిల్లా, శ్రీకాళహస్తి. నా పేరు రుతిక. నాన్న రైల్వే ఉద్యోగి. 9వ తరగతి చదువుతున్నాను. 2022లో రాష్ట్ర జట్టులో స్థానం దక్కింది. జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొన్నాను. మా జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. శిక్షణ పొందుతూ జూనియర్, సీనియర్ పోటీలతో పాటు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా రాణించాలన్నదే నా లక్ష్యం.



- మాది చిత్తూరు జిల్లా, నగరి పట్టణం. నా పేరు తేజేష్. 10వ తరగతి చదువుతున్నాను. మా వీధిలోనే నివాసముంటున్న పీడీ గోపి వద్ద బాల్ బ్యాడ్మింటన్‌లో ఉచిత శిక్షణ తీసుకున్నా. పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో శిక్షణ ఆపేసేవారు. ఇలా శిక్షణ తీసుకుంటూ 2021లో జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యాను. ఆ ఏడాది ఏపీ జట్టు 17 రాష్ట్రాలను ఎదుర్కొని చాంపియన్‌గా నిలిచింది. మళ్లీ ఈ ఏడాది జాతీయ స్థాయి పోటీలో పాల్గొంటున్నాను. స్టార్ ఆఫ్ ఇండియాగా రాణించాలన్నదే నా లక్ష్యం.


నగరి : జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారులతో మంత్రి ఆర్కే రోజా (ఫైల్)

పట్టుదల ఉంటే సాధించలేనిది లేదన్నారు పెద్దలు. ఆ మాటలను నిజం చేస్తున్నారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన గ్రామీణ విద్యార్థులు. ఇటు చదువులోనే కాదు.. అటు క్రీడల్లోనూ విశేషంగా రాణిస్తున్నారు. ముఖ్యంగా బాల్‌బ్యాడ్మింటన్‌లో రాకెట్‌కన్నా వేగంగా దూసుకుపోతున్నారు. జాతీయ స్థాయిలో సత్తాచాటుతూ పతకాల పంట పండిస్తున్నారు. ఇటు తల్లిదండ్రులకు.. అటు రాష్ట్రానికి పేరుప్రతిష్టలు తీసుకొస్తున్నారు. గ్రామీణ క్రీడాకుసుమాల విజయ గాథపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్.

- బాల్‌బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల హవా
- జాతీయ స్థాయిలో మెరుపులు
- పతకాల పంట పండిస్తున్న గ్రామీణ కుసుమాలు
- వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హర్షం వ్యక్తం చేస్తున్న క్రీడాకారులు

నగరి: క్రీడల అభివృద్ధి, క్రీడాకారుల ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను క్రీడాకారులు అందిపుచ్చుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపకయ్యారు. ఇటీవల నంద్యాల జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరచడంతో పాటు నగరికి చెందిన తేజేష్, తిరుపతికి చెందిన ప్రశాంతి జాతీయ స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈనెల 15 నుంచి ఛత్తీస్‌గఢ్, బిలాయ్ బీఎస్పీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్న జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. వీరంతా.. సామాన్య, మధ్య తరగతికి చెందిన వారే కావడం విశేషం. ఒక వైపు చదువుకుంటూ మరో వైపు ఆటల్లో రాణిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

గ్రామస్థాయి నుంచి క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర క్రీడాశాఖ విప్లవాత్మక చర్యలు చేపడుతోంది. ప్రతిభగల విద్యార్థులను వెలుగులోకి తీసుకురావడానికి జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లను నడుపుతోంది. క్రీడాకారులకు ప్రతిభా అవార్డులను అందిస్తోంది. ఈ క్రమంలోనే జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ క్రీడ పూర్వవైభవం సంతరించుకుంటోంది. పాఠశాల, కళాశాల స్థాయిలో పొందిన శిక్షణతో జిల్లా క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. వరుసగా జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు దూసుకుపోతున్నారు.


నగరి: బాల్‌బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

అదే నా లక్ష్యం



"మాది తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, అక్కగారిపేట గ్రామం. 9వ తరగతి చదువుతున్నాను. తండ్రి శివప్రసాద్ ఎలక్ట్రీషియన్. బాల్‌బ్యాడ్మింటన్‌పై మక్కువతో శిక్షణ పొందుతున్నాను. నంద్యాల జిల్లా మహానందిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యాను. జూనియర్, సీఎంకప్ పోటీల్లోనూ పాల్గొని ప్రతిభ చూపాను. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే రాణిస్తున్నాను. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్టును విజేతగా నిలపాలన్నదే నా లక్ష్యం.

– ఆర్.ప్రశాంతి

ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం



జిల్లా నలుమూలల బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాధన చేస్తున్నారు. సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. పోటీలు ఎక్కువగా నిర్వహిస్తుండడంతో ప్రతిభ చాటే అవకాశం లభిస్తోంది. క్రీడాకారులను ప్రోత్సహించడంలో క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అత్యంత చొరవ చూపుతున్నారు. ఆమె సహకారంతో ఈనెల 22వ తేదీ నుంచి జూనియర్ అంతర్ జిల్లాల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలను తొలిసారిగా నగరిలో నిర్వహించనున్నాం.

–బాలాజి, ప్రధాన కార్యదర్శి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్

క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

- క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా

నగరి : క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల ప్రోత్సాహానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పర్యాటక, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. నగరిలో ఈనెల 22 నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి 8వ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల ఆహ్వాన పత్రికలును మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించడంతో పాటు వారిని వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఎప్పటికప్పుడు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నాలుగేళ్లుగా ఏపీ సీఎం కప్, జగనన్న క్రీడా సంబరాలు, శాప్ క్రీడా పోటీలు, రోజా చారిటబుల్ ట్రస్ట్ క్రీడా పోటీలు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు అంటూ టోర్నమెంట్లు నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి.బాలాజీ, ఉపాధ్యక్షుడు డి.గోపి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.సురేష్‌బాబు, అసోసియేషన్ నగరి అధ్యక్షుడు మోహన్, పీడీలు ఎస్‌ఆర్ మణి, చంద్ర, శ్రీనివాసతేజ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న మంత్రి ఆర్కేరోజా

సారా స్వాధీనం .. నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: యాదమరి మండల కేంద్రం రంగనాయకుని చెరువు వద్ద సారా విక్రయిస్తున్న ఆర్.రాజేష్ (26)ను చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యాదమరి వద్ద పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. చెరువు వద్ద రాజేష్ అనే వ్యక్తి నాటుసారా కలిగి ఉండగా అదుపులోకి తీసుకున్నారు. పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి అరెస్టు చూపి, కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం గౌడ్, మమత, వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- గొంతు నులిమి చైను, కమ్మలు ఎత్తుకెళ్లిన దుండగులు
- మూడు బీరువాలు పగులగొట్టి బంగారు, డబ్బు లూటీ
- ఉలిక్కిపడిన యలాజనూరు


హత్యకు గురైన సూర్యకాంతమ్మ

కుప్పంరూరల్: మహిళ ఒంటరిగా ఉన్న విషయాన్ని పసిగట్టిన దుండగులు హతమార్చి బంగారు చైను, చెవులను తెగ్గొసి కమ్మలను దోచుకెళ్లిన దారుణ సంఘటన కుప్పం మండలం, యలాజనూరులో కలకలం రేపింది. మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో జరిగిన ఈ ఘటన వివరాలు స్థానికుల కథనం మేరకు ఇలా.. యలాజనూరుకు చెందిన సూర్యకాంతమ్మ (46) గ్రామంలో ఒంటరిగా నివసిస్తోంది. భర్త శ్రీనివాసులు కరోనా సమయంలో మృత్యువాత పడ్డాడు. కుమారుడు రమేష్ ఉపాధి కోసం బెంగళూరు వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి సూర్యకాంతమ్మపై దాడి చేసి గొంతు నులిమారు. మెడలోని బంగారు చైను, చెవులను తెంచి బంగారు కమ్మలను దోచుకెళ్లారు. ఇంటిలోని మూడు బీరువాలను తెరిచి బంగారు, నగదును ఎత్తుకెళ్లారు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరగ్గా, చుట్టు పక్కల వారు 8 గంటల ప్రాంతంలో గుర్తించారు. సూర్యకాంతమ్మ ఇంటికి వెళ్లి పిలువగా ఎంత సేపటికీ సమాధానం రాకపోవడం, ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి స్థానికులు లోపలికి వెళ్లి చూశారు. అప్పటికే సూర్యకాంతమ్మ విగతజీవిగా పడి ఉండడంతో ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. వెంటనే కుప్పం పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ శ్రీధర్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నారు. బెంగళూరులోని సూర్యకాంతమ్మ కుమారుడు రమేష్‌ను పిలిపించి కేసు విచారణ చేస్తున్నారు. ఈ ఘటన సమాచారం తెలియడంతో గ్రామం ఉలికిపాటుకు గురైంది. రాత్రి ఏడు గంటల సమయంలోనే ఇలాంటి దారుణం జరగడంతో భయాందోళనకు గురయ్యారు.

ప్రజలందరికీ మంచి జరగాలి


మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి, ఆలయ చైర్మన్ రాంబాబు, ఈఓ రామారావు, అర్చకులు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని వేడుకున్నట్టు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా ఉత్సవాల్లో మూడో రోజైన మంగళవారం అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారిని మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కారుమూరి నాగేశ్వరరావు వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి పెద్దిరెడ్డికి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు సాదరంగా స్వాగతం పలికారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా అమ్మవారిని పెద్దిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆయనకు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, పట్టువస్త్రాలను అందజేశారు.

త్వరితగతిన స్వామిత్ర ఈకేవైసీ

చిత్తూరు కలెక్టరేట్ : స్వామిత్ర సర్వే నిర్వహిస్తున్న మండలాల్లో ఈకేవైసీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల జిల్లా అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్లకు సంబంధించి నిర్మాణం ఎంత స్థలంలో ఉంది, ఖాళీ స్థలం ఎంత ఉందో పక్కాగా సర్వే చేసేందుకు స్వామిత్వ సర్వే ప్రక్రియ సాగుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 101 గ్రామాల మ్యాపింగ్ పూర్తి చేసినట్లు, 2 గ్రామాలు అండర్ డీపాపులేషన్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. 34 గ్రామాల్లో ప్రక్రియ పూర్తి అయినట్లు చెప్పారు. ఏడు మండలాల్లో సర్వేకు సంబంధించి 13 నోటిఫికేషన్ జారీచేసినట్లు తెలిపారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలైన రైతు భరోసా, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జలజీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరానికి 79 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 63.91 లక్షల పనిదినాలు కల్పించినట్లు తెలిపారు.

18న నాభూమి– నాదేశం ర్యాలీ

ఈనెల 18న నియోజకవర్గ స్థాయిలో నాభూమి– నాదేశం ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో రెండవ విడత 11 మండలాల్లో ప్రారంభించనున్న జగనన్న పాల వెల్లువ సర్వే ఈనెల 18 లోపు పూర్తి చేయాలని తెలిపారు. జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ లక్ష్మి, డ్వామా పీడీ గంగాభవాని, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయ్‌కుమార్, సర్వే శాఖ ఏడీ గౌస్ బాషా పాల్గొన్నారు.


విద్యుద్దీప కాంతులీనుతున్న గోపురం

రా రమ్మంటున్న బోయకొండ

ప్రసిద్ధ బోయకొండ గంగమ్మ ఆలయం దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పుష్ప శోభితంతో అలరారుతోంది. ఆలయం, పరిసరాలను సుందరంగా ముస్తాబు చేశారు. పుష్కరిణి సమీపంలోని నాలుగుకాళ్ల మండపం వద్ద పూలతో ఓం అనే ఆకారంతో పాటు గాలి గోపురం వద్ద బోయకొండ గంగమ్మ అనే అక్షరమాలతో ఏర్పాటు చేసిన అలంకరణలు కట్టిపడేస్తున్నాయి. అలాగే ఉత్సవర్లను కొలువుదీర్చే చోట, గర్భాలయం వద్ద పుష్పాలంకరణలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. విద్యుద్దీపాలంకరణలు ఆకర్షిస్తున్నాయి. దసరా మహోత్సవాలను పురస్కరించుకుని నిత్యం పుష్పాలంకరణలు చేస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి తెలిపారు.

– చౌడేపల్లె



ఓం అక్షరమాలతో స్వాగతం


ఆలయంలో పుష్పాలంకరణ